క్లుప్తంగా

మహిళా సంఘాల రుణాలు సక్రమంగా చెల్లించాలి



సభ్యులతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సమ్మ

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘాల రుణాలను సక్రమంగా చెల్లించాలని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో రుణాల రికవరీ విషయంలో మహిళా సంఘాల సభ్యులతో క్షేత్ర స్థాయిలో మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఆధ్వర్యంలో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే, తిరిగి కొత్తగా రుణాలు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంతో పాటు గ్రామ నాయకులు సంఘాల సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్



నియామకపత్రం అందుకుంటున్న శివ

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఫిషర్ మెన్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రామాయంపేటకు చెందిన దండు శివకుమార్ నియామకమయ్యారు. ఈమేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యులు సుప్రభాత రావు, మ్యాడం బాలకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్‌స్కూల్ పరీక్షల ఫీజుకు 30 ఆఖరు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని ఓపెన్ స్కూల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ ఆఖరు అని పేట ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ విఠల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత పరీక్షలు

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చేగుంటలో ఉచిత డయాబిటీస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 26 మందికి రక్త పరీక్షలు చేసి, డయాబిటీస్‌కు సంబంధించిన రిపోర్టులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనీల్, కార్యదర్శి బుర్క నాగరాజు, సుఖేందర్, నాగరాజు, డాక్టర్ గణేశ్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి

నర్సాపూర్: మండలంలోని ముదిరాజ్‌ల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన కొండి నాగభూషణం తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ తనను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించారని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో బుధవారం ఆలయ అర్చకుడు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు.

రామతీర్థంలో అఖండ జ్యోతి

పాపన్నపేట(మెదక్): మండలంలోని రామతీర్థంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అఖండ జ్యోతిని వెలిగించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఈ అఖండ జ్యోతిని వెలిగించామని భక్త జన సభ్యుడు బాబాగౌడ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కౌల్దారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయలక్ష్మి బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధించుటకు పాఠశాల, కళాశాలలో మొత్తం 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మాథ్స్(టీజీటీ), ఫిజికల్ డైరెక్టర్(పీడీ), జూనియర్ లెక్చరర్ బోటనీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సంబంధించిన సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ, బీఈడీ, బీపీఈడీ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18న సంబంధిత జిరాక్స్ కాపీలతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులు లేక మూత'బడి'

- పేదవారికి దూరమవుతున్న విద్య
- మూడు పాఠశాలలకు తాళం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



కాన్షీరాంనగర్‌లో మూతపడ్డ మన ఊరు - మనబడి ప్రాథమిక పాఠశాల

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులు లేక పాఠశాలలు మూతపడుతున్నా.. విద్యా శాఖ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముచ్చటగా మూడు ప్రభుత్వ పాఠశాల లు మూతపడ్డాయి. ఇందులో లక్షలు ఖర్చుపెట్టిన మన ఊరు – మన బడి పాఠశాల ఉండటం విశేషం. ఇది అల్లాదుర్గం మండలంలో ప్రాథమిక విద్య దుస్థితి.

➡ అల్లాదుర్గం మండలంలో 22 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇందులో 16 పాఠశాలలు ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో కొనసాగుతున్నాయి. విద్యార్థులు లేక మూడు ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ఉంటే టీచర్లే పక్క పాఠశాలలో చేర్పించి, పాఠశాలను మూతపడేలా చేశారనే ఆరోపణలున్నాయి. విద్యార్థులు లేరని టీచర్లు చెప్పడంతో విచారణ చేయకుండా, జిల్లా అధికారులు గ్రామస్తులు, తల్లిదండ్రులతో మాట్లాడకుండానే పాఠశాలలను మూసేసి, టీచర్లను మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు.

➡ అల్లాదుర్గం కాన్షీరాంనగర్ ప్రాథమిక పాఠశాల మన ఊరు – మనబడి కింద ఎంపికైంది. ఈ పాఠశాలలో కరెంట్, కిచెన్‌షెడ్, నీటి సౌకర్యం పనులు చేపట్టారు. ఈ పనులకు రూ. 4 లక్షలు ఖర్చు పెట్టారు. ఈ పాఠశాలలో గత సంవత్సరం 8 మంది విద్యార్థులు చదువుకునేవారు. ఇందులో హాస్టల్ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అయితే ముగ్గురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు, మరో ముగ్గురు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లిపోయారు. ఇద్దరు విద్యార్థులను అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

దీంతో విద్యార్థులు లేరని పాఠశాలను మూసేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయున్ని నీలకంఠిపల్లి పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు.

➡ పల్లేగడ్డ (కుసంబీనగర్)ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం కేవలం ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడితో కొనసాగింది. ఈసారి ఇద్దరు విద్యార్థులు చిల్వెర ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. దీంతో విద్యార్థులు లేక ఈ పాఠశాల మూతపడింది. ఈ పాఠశాల ఉపాధ్యాయుడు చిల్వెర జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

➡ చౌటాక్ తండా ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది ఇద్దరు విద్యార్థులతో కొనసాగింది. ఈ పాఠశాలకు చెందిన టీచర్‌కు రోడ్డు ప్రమాదం జరగడంతో కొన్ని నెలలు సెలవులపై వెళ్లడంతో పాఠశాలను సీఆర్పీతో నడిపించారు. ఈసారి ఇద్దరు విద్యార్థులను మందాపూర్ పాఠశాలలో చేర్పించడంతో విద్యార్థులు లేక పాఠశాల మూతపడింది. ఈ పాఠశాల టీచర్ మందాపూర్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాల్యవివాహాలు చేయొద్దు

కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ నక్రుబాయి



బాల్యవివాహాలు చేయమని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కౌడిపల్లి(నర్సాపూర్): మీ పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ నక్రుబాయి అన్నారు. బుధవారం కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో జరిగే అనార్థాలు, బాలల అక్రమ రవాణాపై కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్ర మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు బాల్య వివాహాలతో మానసిక, శారీరక అభివృద్ధి లేకపోవడంతో నష్టపోతారని చెప్పారు. మహిళలను వేధిస్తే 100కు ఫోన్‌చేయాలని చెప్పారు. పిల్లలు పెంపకంలో ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా పెంచాలని వివరించారు. అనంతరం బాల్య వివాహాలు చేయమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ దుర్గమని, ఏపీఎం సంగమేశ్వర్, సీఏ ఏసు, మహిళలు పాల్గొన్నారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి



టేక్మాల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న దళితులు

రేగోడ్(మెదక్): దళితబంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రేగోడ్ రోడ్డుపై దళితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బుధవారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొందరు దళితులు మాట్లాడుతూ.. కొందరికే దళితబంధు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితబంధు పథకాన్ని పక్ష పతంగా అమలు చేయడం ఏమిటని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బోడగట్టులోని దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పోచయ్య, ఆదామ్, వేణు, యాదమ్మ, స్వప్న, సుమిత్ర, సంగయ్య, సాయమ్మ, సాయిలు, లక్ష్మయ్య, దాసు, నాగరాజు ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టి.మాందాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం చిన్నశంకరంపేట మండల పరిధిలోని టి.మాదాపూర్‌కు చెందిన 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భావితరాలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మన ప్రభుత్వం పంటల సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుంటే.. 3 గంటల కరెంట్ సరఫరా చాలని కాంగ్రెస్ నాయకులు అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెట్లోరి రాజు, నారాయణ, అశోక్ సురేశ్, దేవయ్య శంకరయ్య దశరథం మాణిక్యం మహేందర్, ప్రశాంత్, నర్సింలు, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు

కౌడిపల్లి(నర్సాపూర్): అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేయడంతో పాటు పాఠాలు బోధించారు. బుధవారం కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు హెచ్ఎం స్వరూపరాణి ఆధ్వర్యంలో అగస్త్య ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్లు శ్రీకాంత్, సరిత, డిగంబర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ప్రయోగాలతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్‌ను గృహాలకు వినియోగించుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): శ్రీనిధిలో సబ్సిడీపై గృహాలకు సైతం సోలార్ యూనిట్స్‌లను అందజేస్తున్నామని, గృహాలకు వినియోగించుకోవాలని శ్రీనిధి రీజనల్ మేనేజర్ గంగారం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని లింగారెడ్డిపేట్‌లోలబ్ధిదారులకు సోలార్ యూనిట్‌లను అందజేశారు. గ్రామానికి చెందిన శివ్వగొని సబితాకు రూ. 1,92,360ల సోలార్ యూనిట్స్ సబ్సిడీపై ఇచ్చారు. ఈ సందర్భంగా వాటి పని తీరును పరిశీలించారు. గృహాలకు పోగా మిగులు విద్యుత్‌ను సైతం అమ్ముకోవచ్చన్నారు. వీరి వెంట శ్రీనిధి మేనేజర్ అంజని, ఏపీఎం పెంటాగౌడ్, సీసీ విజయలక్ష్మి, మహిళా సమైఖ్య సభ్యులు తదితరులున్నారు.

అర్హులందరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నర్సాపూర్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు బూత్ లెవెల్ ఆఫీసర్లకు(బీఎల్ఓ) సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని బీఎల్ఓలకు పట్టణంలోని బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీలో శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని నిర్ణీత ఫారంలో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

'అపరాజిత' మహోత్సవానికి ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): సంగారెడ్డి జిల్లా పసల్వాదివద్దగల శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఈనెల 25నుంచి 27వతేది వరకు నిర్వహించే శ్రీఅపరాజితా విద్యాయాగ మహోత్సవం పూజ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశ్మ సిద్ధాంతి తెలిపారు. బుధవారం మండలంలోని పాంపల్లి, సదాశివపల్లి, వెల్మకన్న తదితర గ్రామాలలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపీఠంలో శ్రీకొలాస ప్రస్తార మహామేరు పంచముఖ ఉమామహేశ్వర స్వామి దేవాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా జయ విజయ సమేత శ్రీఅపరాజిత విద్య దేవాలయం ద్రావిడ శిల్పకళా పద్ధతిలో తిక్త శిలలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు మెట్టు రాములుశర్మ, సదాశివపల్లి సర్పంచ్ శోభనర్సింగ్‌రావు, వెల్మకన్న సర్పంచ్ రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ రాయగిరి, క్రిష్ణగౌడ్, వీరగౌడ్, నాగరాజు, కిష్టయ్య భక్తులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి తండా, చిన్నతండాకు తారురోడ్డు మంజూరు చేయించినందుకు రెండు తండాల గిరిజనులు బుధవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. ఈమేరకు ఎంపీని ఆయన నివాసంలో కలిసిన నాయకులు సన్మానించారు. జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ సబిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, గ్రామశాఖ అధ్యక్షుడు బాషానాయక్, సర్పంచ్ చత్రియా నాయక్, సహకార సంఘం డైరెక్టర్ బిక్యానాయక్, తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్



జాతీయ రహదారి పక్కన పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ రహదారికి ఇరువైపుల బుధవారం అధికారులు పారిశుద్ధ్య పనులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తునికి నుంచి కౌడిపల్లి వరకు 765డి జాతీయ రహదారికి ఇరువైపుల మొక్కలు నాటడంతో పాటు చెత్తను శుభ్రం చేశారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల ఏరివేత, పిచ్చిమొక్కలను తొలగించారు. కౌడిపల్లితో పాటు జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో వివిధ గ్రామాల కార్మికులను తీసుకొచ్చి పనులు చేయించారు. కౌడిపల్లిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

'ప్రాణం ఉన్నంత వరకు పేదలకు సేవచేస్తా'



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాణం ఉన్నంత వరకు పేద ప్రజలకు సేవ చేస్తానని మైనంపల్లి సోషల్ సరీ్వస్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని అంబాజిపేట, మడూర్, శాలిపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. తమ తండ్రి మైనంపల్లి హన్మంతరావు బాటలో నడుస్తు పేదలకు సేవలందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అంబాజిపేటలో భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ సర్పంచ్‌లు మైనంపల్లి రంగారావు, సత్యనారాయణ, మనోజ్, నాయకులు తదితరులు ఉన్నారు.

లెర్నింగ్ లైసెన్సుల అందజేత

రామాయంపేట(మెదక్): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు నార్సింగి మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు బుధవారం 80 మంది యువకులకు మంజూరైన లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. యువతను ప్రోత్సహించి వారు విధిగా డ్రైవింగ్ లైసెన్సు పొందాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే వందలాది మంది యువకులకు లైసెన్సులు ఇప్పించడం జరిగిందని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పట్టణాధ్యక్షుడు షీర్న శేఖర్, శ్రీకాంత్, వార్డు సభ్యుడు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోరు వేస్తే అడ్డుకుంటారా ?

తహసీల్దార్ నవీన్‌పై బూర్గుపల్లి గ్రామస్తుల ఆగ్రహం



తహసీల్దార్ నవీన్‌ను నిలదీస్తున్న మహిళలు

హవేళీఘనపూర్: నీటి సమస్య తీర్చడానికి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోరు వేసేందుకు వస్తే తహసీల్దార్ అడ్డుకోవడంతో మండలంలోని బూర్గుపల్లి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బూర్గుపల్లిలోని పలు కాలనీలో తాగునీటి ఎద్దడి ఉన్న విషయంపై మైనంపల్లి సోషల్ సర్వీస్ వారు స్పందించి బోరులారీని తీసుకొచ్చారు. దీంతో బోరు వేసేందుకు అనుమతి లేదని తహసీల్దార్ నవీన్ అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు ఆయనను నిలదీశారు.

బాలుడిపై కుక్కల దాడి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాఠశాలకు వెళ్తున్న బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్పనూరి మోక్షిత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వెళ్తున్న మోక్షిత్‌పై కుక్కలు దాడి చేశాయి. గాయపడిన బాలుడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిరుపేదలకు వరంగా సీఎంఆర్ఎఫ్**

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనారోగ్యాలకు గురై చికిత్స చేయించుకోలేని నిరుపేదల పాలిట సీఎంఆర్ఎఫ్ పథకం వరంగా మారిందని జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్‌హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బండపోతుగల్ గ్రామానికి చెందిన వినోదకు రూ. 17 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈస్తారీ ఉన్నారు.

◆ **పేటలో గాంధీ చిత్ర ప్రదర్శన**

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని లక్ష్మీ థియేటర్‌లో బుధవారం గాంధీ చిత్రాన్ని ప్రదర్శించారు. పేటలోని కస్తూర్బా, మోడల్‌స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా గాంధీ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య సాధనకు సంబంధించిన అంశాలపై నిర్మించిన చిత్రాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

◆ **పాఠశాలలో బోరుమోటార్‌కు ప్రతిపాదన**

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాలలో మంచినీటి సమస్య తీర్చేందుకుగాను బోరు వేసేందుకు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, హెచ్ఎం రాధాకిషన్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ. 5లక్షలకు హామీ ఇచ్చారు. బోరు, మోటర్, పైప్‌లైన్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దీంతో పాఠశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జగన్, నాయకులు నాయికోటి లింగం తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉద్యోగుల అక్రమ అరెస్ట్ సరికాదు**

నర్సాపూర్: సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు అన్నారు. బుధవారం సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు టైం స్కేలు ఇవ్వాలన్న డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు అక్రమ అరెస్టులను ఖండించారు. ప్రభుత్వం స్పందించి, సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని శ్రీనివాస్‌రావు, పద్మారావులు డిమాండ్ చేశారు.

◆ **విరాళం**

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీల గ్రామంలో నిర్మిస్తున్న మల్లన్నగుడి నిర్మాణానికి శివ్వంపేట జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ. 50 వేలు విరాళం అందజేశారు. దీంతో యాదవ కులస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చల్ల మహేశ్, ఎర్రొల్ల మహేశ్, బండ పోశయ్య, మల్లేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **టీకాలు తప్పనిసరి**

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో పశువులకు నట్టల నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పశు వైద్యశాల అసిస్టెంట్ డాక్టర్ రామకృష్ణ, గోపాలమిత్ర ప్రశాంత్, గ్రామస్తులు ఉన్నారు.

◆ **పనుల అడ్డగింత**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని గిరిజన బాలుర వసతిగృహం ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం అడ్డుకున్నారు. హాస్టల్ భవనానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వార్డెన్ దర్శన్ ప్రహరీ నిర్మాణానికి గుంతలు తీయిస్తుండగా.. పలువురు వ్యక్తులు మా భూమి అంటూ అడ్డు తగిలి పనులు నిలిపివేయించారు.

◆ **క్రీడా సామగ్రి అందజేత**

రామాయంపేట(మెదక్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నార్సింగి మండలంలోని శంకాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం సోలార్ కంపెనీ ప్రతినిధులు ఆట సామగ్రి, క్యారం బోర్డులు, చెస్, జీకే పుస్తకాలు అందజేశారు. వీటిని సర్పంచ్ సుజాత శ్రీనివాస్, ఉప సర్పంచ్ అనిల్‌గౌడ్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ క్లస్టర్ ఏజీఎం యేసుబాబు, ప్లాంట్ ఇన్‌చార్జ్ రవికుమార్, వార్డు సభ్యులు పద్మ, నర్సింలు, మల్లేశ్, లక్ష్మి, రేఖ పాల్గొన్నారు.

◆ **మెదక్ అభివృద్ధిని మరిచిన పాలకులు**

మెదక్: రాష్ట్రంలోని అన్ని జిల్లాలు అభివృద్ధి చెందుతున్నా.. మెదక్ మాత్రం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండన్ సురేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మెదక్‌లో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, ఇప్పటికైనా పాలకులు ఈ జిల్లాపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, నూతన కలెక్టరేట్‌లో అన్నిశాఖలను ఏర్పాటు చేయాలన్నారు.

◆ **గ్రామాల్లో కుష్టు వ్యాధి సర్వే**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో కుష్టు వ్యాధి సర్వేకు సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఎవరికైన స్పర్శలేని మచ్చలు, ఇతర కుష్టు వ్యాధి లక్షణాలను పరిశీలించారు.

◆ **గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ**

మనోహరాబాద్(తూప్రాన్): గృహలక్ష్మి పథకం అర్హుల కోసం దరఖాస్తులను స్వీకరించినట్లు సర్పంచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని గౌతోజీగూడెం గ్రామానికి చెందిన 27 మంది దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేణుకుమార్, కార్యదర్శి నందిని, తదితరులున్నారు.

◆ **రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రహీంగూడ తండాకు చెందిన నునావత్ కిషన్‌నాయక్, కమ్లీబాయిలు బ్యాంకులో పని నిమిత్తం బైక్‌పై వెళ్తూ చిట్కుల్ వద్ద గాయాపడ్డారు. ఇసుజు వాహనం నడిపిస్తున్న డ్రైవర్ హేరాసింగ్ చిట్కుల్ పాఠశాలకు వెళ్తుండగా గెదేలు అడ్డం వచ్చాయి. వాటిని తప్పించబోయి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న భార్యభర్తలకు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ఆర్ఎంపీ వద్దకు తరలించారు.

◆ **ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలి**

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెదలాలని జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. బుధవారం వెల్దుర్తి మండలంలోని చర్లపల్లి గ్రామంలో నిర్మించనున్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం, రాంచంద్రంగౌడ్, నవీన్, పోచగౌడ్ ఉన్నారు.

◆ **విద్యార్థులకు ప్రశంసాపత్రం**

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారని కౌడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధకిషన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో కౌడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు బోయిని సాహిత్య, మంతూరి దీక్షిత 9.3జీపీఏ సాధించి ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. దీంతో సునీతారెడ్డి విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసపత్రం అందజేశారు.

◆ **ధర్నాకు తరలిన సమగ్ర శిక్ష ఉద్యోగులు**

రేగోడ్(మెదక్): సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ బాధ్యులు బుధవారం హైదారబాద్‌లో నిర్వహించిన ధర్నాకు ఆ సంఘం మండల ఉద్యోగులు తరలివెళ్లారు. పేస్కేల్, ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులు తదితర డిమాండ్లను పరిష్కరించాలని సంఘం నేతలు కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు సంతోష్, ఉద్యోగులు శ్వేత, సిద్దు, రవి ఉన్నారు.